క్లుప్తంగా

మామడ ఎస్సైగా రాజు



మామడ: మామడ మండల ఎస్సైగా కె.రాజు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై మామడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై అశోక్ నిజామాబాద్ టౌన్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

మండల సమావేశం వాయిదా

దస్తురాబాద్: మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ సింగరి కిషన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవాసానికి విరాళం



విరాళం అందిస్తున్న పోశెట్టి

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద ఆవాసం నిర్వహణకు నిర్మల్‌కు చెందిన పోశెట్టి–శారద దంపతులు రూ.21వేల విరాళం అందించారు. తమ మనుమడు అవిక్షిత్ పుట్టినరోజు శుక్రవారం ఆవాసంలో విద్యార్థుల మధ్య నిర్వహించారు. విద్యార్థులకు ఒకరోజు భోజన ఖర్చుల కోసం రూ.3100 అందించారు. ఆవాసం అధ్యక్షులు శైలేశ్ మాశెట్టివార్, ప్రముఖ్ లింగారెడ్డి, విద్యాధర్, శైలజ ఉన్నారు. అనంతరం డాక్టర్ కిరణ్ ఫౌండేషన్ చైర్మన్ కిరణ్ ఆధ్వర్యంలో ఆవాసం విద్యార్థులకు బ్యాగులు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్‌తో పాటు కడెం మండలం లింగాపూర్‌కు చెందిన పలువురు యువకులు, బీఆర్‌ఎస్ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనిగారపు శ్రావణ్, రాజేశ్వర్‌గౌడ్, పాల సంతోష్, రమేశ్, దివాకర్, ప్రసాద్, సాబీర్ తదితరులు ఉన్నారు.

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం




శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన పీరీలు

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో శుక్రవారం మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మత సామరస్యానికి ప్రతీక అయిన ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు మండపాల్లో నిర్వాహకులు పీరీలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 29న జరిగే మొహర్రం పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు నిత్యం కాలనీల్లో ఊరేగింపు చేపట్టనున్నారు.

సదర్మాట్ లోనికి వెళ్లొద్దు

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలో ఉన్న సదర్మాట్ వద్దకు వచ్చే సందర్శకులు అనుమతి లేకుండా లోపలికి వెళ్లవద్దని ఎస్సై ఆర్.శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదర్మాట్ లోపలికి యువకులు, సందర్శకులు వెళ్లకుండా పోలీసులు, ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు, ఇనుప చువ్వలు ఏర్పాటు చేశామన్నారు. జలపాతం వద్ద సెల్ఫీలు దిగేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి



వంతెన వద్ద పరిశీలిస్తున్న ఎస్సై రవీందర్

సోన్: మండలంలోని జాఫ్రపూర్, మాదాపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవీందర్ అన్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టు నిండుకోవడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. స్వర్ణ వాగు ఉధృతంగా ప్రవహించడంతో సోన్ మండలంలోని జాఫ్రపూర్, మాదాపూర్ వంతెనలను ఎస్సై, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

'చట్టబద్ధత కల్పించాలి'

సారంగపూర్: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోలేదన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి గజేందర్, స్వామి, అన్వేశ్, దినేశ్, రాజేశ్వర్, బుజ్జన్న తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. ప్రజలకు కష్టం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- వరదతో దెబ్బతింటున్న పంటలు
- పలు చోట్ల కోతకు గురైన రోడ్లు.. రాకపోకలకు ఇబ్బందులు



లక్ష్మణచాంద: రాచాపూర్‌లో సోయా చేనులో వరద



భైంసారూరల్: వాడిలో పత్తి చేనులో నిలిచిన వరద

లక్ష్మణచాంద/భైంసారూరల్: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో పంటలు నీట మునుగుతున్నాయి. మొక్కజొన్న, సోయా, పసుపు పంట చేన్లలో భారీగా వరద చేరింది. ఇలాగే వర్షం కొనసాగితే తమకు నష్టం వాటిల్లుతుందని.. వరుణుడు కరుణించాలని రైతులు వేడుకుంటున్నారు.

పంచగుడిలో గోదావరి పరవళ్లు..

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలోని గోదావరి వంతెన వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని గడ్డెన్నవాగు, ఇతర వాగులు పొంగిపొర్లుతున్నాయి. వరద ఉధృతికి నదిలోని పురాతన శివాలయం చుట్టూ వరద చేరుతుంది.

కుంటాలలో..

కుంటాల: మండలవ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షం కురిసింది. దౌనెల్లిలో 15ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఓలా శివాలయం వద్ద ఉన్న లోతట్టు వంతెన పై నుంచి నీరు ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేకాధికారి మసార్ రావు, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచ్ కనీష్‌ఫాతిమ, పర్యవేక్షించారు. ఓలాలో గాండ్ల శేఖర్, మంగళి గజ్జారాంలకు చెందిన పాత ఇళ్లు కూలిపోయాయి. వర్షాలతో కల్లూర్ చెక్‌డ్యాం కోతకు గురైంది. మండలంలో 12సెం.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

సిద్ధాపూర్ బ్రిడ్జి వద్ద గుంతలు..



వంతెన పరిశీలిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

నిర్మల్‌టౌన్: సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు గేట్లు వదలడంతో దాని పరివాహక ప్రాంతమైన పట్టణంలోని సిద్ధాపూర్ వంతెన వద్ద పగుళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయి. నిర్మల్ నుంచి వంతెన మీదుగా కౌట్ల, సిద్దిలకుంట, వెల్మల్ గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సయ్యద్ హైదర్, తదితరులు బ్రిడ్జి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. రవి, అకీఫ్, మోసెబ్ ఉన్నారు.



లోకేశ్వరం : పంచగుడి వంతెన వద్ద ప్రవాహం

కోతకు గురైన రోడ్డు



పెంబి: భారీ వర్షాలకు మండలంలోని లోతర్య తండా గ్రామం దాటిన తర్వాత తాటిగూడ వెళ్లే మార్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు కోతకు గురైంది. దీంతో పుల్గంపాండ్రి, తాటిగూడ గ్రామాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. బైక్‌లు తప్ప వేరే వాహనాలు వెళ్లే మార్గం లేదు. రోడ్డు పూర్తిగా కోతకు గురవక ముందే సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కుంటాల: కోతకు గురైన కల్లూర్ చెక్‌డ్యాం



ఓలాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

తహసీల్.. ఇక తెరమరుగు

- నిజాంకాలం నాటి కట్టడం
- దశాబ్దాలుగా సేవలందించిన భవనం
- ఎన్నో ఘటనల జ్ఞాపకం.. ఇక ఖతం



నిర్మల్ అర్బన్ పాత తహసీల్దార్ కార్యాలయం



నేలకొరుగుతున్న చారిత్రక కట్టడం

నిర్మల్:నిర్మల్ తహసీల్ ఆఫీస్.. ఎప్పుడో నిజాం రాజుల కాలంలో నగరం నడి బొడ్డున రాజభవనంలా నిర్మించిన కట్టడం. డంగుసున్నం, బలమైన గోడలతో ఆకట్టుకునే ఆకృతిలో ఉన్న భవనం.. దశాబ్దాల నుంచి నిన్నమొన్నటి దాకా సేవలందించింది. ఒకప్పుడు ఆంగ్లేయ కలెక్టర్లకు కార్యాలయంగా, నిజాం అధికారులకు ఆఫీసుగా, స్వాతంత్య్ర పోరాటాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత కూడా రెవెన్యూ, ఖజానా శాఖ కార్యాలయాలకు సేవలందించింది. తరాలు మారినా, ఎన్ని భవనాలు నేలకూలినా తాను మాత్రం చెక్కుచెదరకుండా నిలిచింది. కానీ గత రెండు, మూడేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇబ్బంది పడి క్రమంగా శిథిలావస్థకు చేరింది. గతేడాది ఓ వైపు పెచ్చులూడిపోయింది. అయినా అప్పటి అధికారులకు ఈ భవనం కూల్చేయాలంటే మనసు ఒప్పలేదు.

సమీకృత నిర్మాణంతో..

జిల్లాకేంద్రం శివారులో సమీకృత భవనం నిర్మించడంతో స్థానిక కలెక్టరేట్‌ను అక్కడకు తరలించారు. ఖాళీగా మారిన పాత కలెక్టరేట్ భవనంలోకి నిర్మల్ ఆర్డీవో, నిర్మల్‌అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలనూ తరలించారు. జిల్లా ఏర్పడినప్పుడే ఇందులో ఓ మూలన ఉండే ట్రెజరీ కార్యాలయాన్ని బాలసదనం భవనంలోకి మార్చారు. నిన్నమొన్నటి దాకా అర్బన్ తహసీల్ ఆఫీస్, ఆధార్ సెంటర్ కొనసాగాయి. ఇవి రెండూ పాత కలెక్టరేట్‌లోకి మార్చారు. దీంతో అర్బన్ తహసీల్ ఆఫీస్ బోసిపోయింది. ఈ మధ్య పట్టించుకునేవారు లేక మరింత శిథిలావస్థకు చేరింది. మరోవైపు ఈ కార్యాలయం ఉన్న స్థలాన్ని సమీకృత(వెజ్, నాన్‌వెజ్) మార్కెట్ కోసం కేటాయించారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

ఈక్రమంలోనే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్ కార్యాలయం కూల్చివేత ప్రారంభించారు. దశాబ్దాలుగా సేవలందించిన ఈ భవనం పొక్లెయిన్ వేటుకు కూలిపోతుంటే చాలా మంది స్థానికులు ఆవేదనతో చూడటం కనిపించింది.

ఆపద వస్తే సంప్రదించండి

- నిర్మల్‌లో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్



జీఎన్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో 24 గంటలు పని చేసే టోల్ ఫ్రీ నెంబర్ 79933 96793 ఏర్పాటు చేశామని.. పట్టణవాసులు ఆపద వస్తే సంప్రదించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పేర్కొన్నారు. నిర్మల్‌లోని జీఎన్‌ఆర్, సిద్ధాపూర్, శ్రీనగర్ కాలనీల్లో చైర్మన్ పర్యటించారు. సిద్ధాపూర్ వాగు వరద ప్రవాహం పరిశీలించారు. వరద రావడంతో సారంగపూర్ మండలంలోని స్వర్ణ జలాశయం నిండుకుండలా మారిందన్నారు. సిద్ధాపూర్, జీఎన్‌ఆర్ కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట కౌన్సిలర్ అన్వర్ పాషా, కాలనీవాసులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో శుక్రవారం ఫ్రైడే, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లలో నిలవనీటిని తొలగించుకునేలా స్థానికులకు చైర్మన్ ఈశ్వర్ అవగాహన కల్పించారు. పలు చోట్ల నీటి తొట్టిలు, పాత ట్యాంకులు, పాత్రల్లో నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, సిబ్బంది ఉన్నారు. అంతకుముందు పాత అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు పనులను వారు పరిశీలించారు. ఏఈ హరి భువన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

లారీ ఓనర్ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

భైంసాటౌన్: లారీ ఓనర్లు, క్లీనర్ల సమస్యలు పరిష్కరించి.. వారి సంక్షేమానికి పాటుపడతామని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆటోనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భైంసా లారీ ఓనర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అంతకుముందు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్‌తోపాటు ఇతర జిల్లాల మాదిరి లారీల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలన్నారు. నిరుపేదలైన లారీ డ్రైవర్లు, క్లీనర్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ చైర్మన్ కృష్ణ, ఆసిఫ్, తోట రాము తదితరులున్నారు.

నూతన కార్యవర్గం..

భైంసా లారీ ఓనర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహమూద్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఆరిఫ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అలీం హుస్సేన్, కోశాధికారిగా అబ్దుల్ రఫీక్, మహ్మద్ రియాజ్, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ లాయక్, ఎండీ ముజిబుద్దీన్, ఇతర సభ్యులుగా రాజు వ్యాస్, మిర్జా మక్బూల్, అబ్దుల్ రహీం ఎన్నికయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

భైంసా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. పెండెప్ భోజన్నకు రూ.లక్ష, సాయినాథ్‌కు రూ.లక్ష, సీహెచ్.రాజేశ్వర్‌కు రూ.62వేలు, మహేశ్‌కు రూ.14వేలు, వై.సాయినాథ్‌కు రూ.1.25లక్షలు, రాజన్నకు రూ.12వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ, రాము, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

'మహేశ్వర్‌రెడ్డి దుష్ప్రచారం మానుకోవాలి'



నిర్మల్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

లక్ష్మణచాంద: మంత్రి ఐకేరెడ్డి బీజేపీలో చేరేందుకు యత్నిస్తున్నారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దుష్ప్రచారం చేయడం మానుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిర్పెల్లిలో ఆయన మాట్లాడారు. మంత్రి బీజేపీలో చేరేందుకు యత్నిస్తున్నాడని మహేశ్వర్‌రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. మంత్రిపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోబోమని జెడ్పీటీసీ రాజేశ్వర్ అన్నారు. లక్ష్మణచాందలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ ఎంపీటీసీ గణేశ్, జహీరొద్దీన్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డికి మంత్రి ఐకేరెడ్డిపై గెలిచే సత్తా లేదని ఎప్పటికీ మాజీలాగే ఉంటారని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీలో చేరారన్నారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ నేరెళ్ల వేణు, కౌన్సిలర్లు నవీన్, రాజు, రమణ, ఆకుల రామకృష్ణ, అన్వర్, నరేందర్ పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



రోడ్డుపై వరినాటు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడింగ్(విస్తరణ) పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఖానాపూర్ ప్రధాన రహదారిపై పలు చోట్ల వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం మాట్లాడారు. పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా పూర్తి చేయడం లేదన్నారు. రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని.. త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నా.. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్‌నాయక్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు రమేశ్, గంగనర్సయ్య, తోట సత్యం, శ్యాంమోహన్‌రావు, అనిల్, వంశీ, అరవింద్ తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖానాపూర్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నిర్మల్‌టౌన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళల హత్యలు, అత్యాచారాలు జరగడం దేశానికి సిగ్గుచేటని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతం సుజాత అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని వైస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గంగామణి, పూజ, గంగాజ్యోతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని, హోంమంత్రి బాధ్యత వహించాలి

మణిపూర్ అల్లర్ల ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా పూర్తి బాధ్యత వహించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్ల లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిరసన వ్యక్తం చేశారు. పీఓడబ్ల్యూ నాయకులు బంతి ముత్తవ్వ, రాణి, గంగమణి, రాజమణి, తదితరులు ఉన్నారు.

నిల్వనీటిని పారబోయండి



లక్ష్మణచాంద: ధర్మారంలో పారబోస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: పాతటైర్లు, కూలర్లు, ఇతర పాత్రల్లో ఉన్న నిల్వనీటిని పారబోయాలని వైద్యసిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వీధులు తిరుగుతూ నిల్వనీటిని పారబోయించారు. కార్యక్రమంలో శివకృష్ణ, సుగుణ, వనజ, కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా, దౌనెల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారి మసార్‌రావు పర్యటించారు. ఓలా శివాలయం వద్ద లోతట్టు వంతెనను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచ్‌లు ఎండీ హైమ్మద్, కనీష్‌ఫాతిమా, ఏపీవో నవీన్, కార్యదర్శులు సురేష్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఈవీఎంల వినియోగంపై అవగాహన

దస్తురాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం ఈవీఎంల వినియోగంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, డిప్యూటీ తహసీల్దార్ తెలంగ రావ్, శ్రీనివాస్, గంగాధర్, నరేందర్, నారాయణ, బీఎల్‌వో సుగుణాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని గన్నోరలో ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లావణ్య కిష్టయ్య, ఆశన్న, లక్ష్మణ్ తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్, న్యూకంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఈవీఎంల వినియోగంపై డీటీ గంగాధర్ అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ నిర్వహించారు. సర్పంచ్‌లు శ్రీవిద్య, లావణ్య, కార్యదర్శి సుధాకర్, ఏఎస్సై నారాయణరెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

పెంబి: మండలంలోని మందపల్లికి చెందిన మత్స్యకారుడు కొండ్ర నర్సయ్య చేపల వేటకు వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి శుక్రవారం గ్రామానికే చెందిన శివాజీనగర్ చిట్టీ గ్రూప్ సభ్యులు యాభై కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భూమన్న, నారాయణ, మహేందర్, మధుకర్, చందు, రమేశ్, రాజేందర్, శ్రీధర్, సృజన్ తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

లోకేశ్వరం: మండలంలోని బామ్ని(కే)లో బారుకుంట అలుగుకు అడ్డం ఉన్న పొలం తొలగించి.. ముంపునకు గురవుతున్న పంటలను కాపాడాలని అదే గ్రామంలోని పలువురు రైతులు తహసీల్దార్ సరితను కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

బీజేపీ నాయకుల అరెస్టు

ఖానాపూర్: పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులకు పంపిణీ చేశారని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అప్లికేషన్ మేళా నిర్వహిస్తారనే సమాచారంతో పోలీసులు శుక్రవారం పలువురు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, పార్టీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ మాట్లాడారు. వెంటనే అర్హులకు ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, ఎనగందుల రవి తదితరులు ఉన్నారు.

పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

కుంటాల: పాడి పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని నర్సాపూర్(జి) ఎస్‌బీఐ శాఖ మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల మహాలక్ష్మీ ఆలయ ఆవరణలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. విజయ డెయిరీ ద్వారా 18 మందికి ముద్ర రుణాలు మంజూరు చేసినట్లు విజయ డెయిరీ మేనేజర్ దస్సునాయక్ తెలిపారు. పశుపోషణతో కలిగే లాభాలను వివరించారు. భైంసా, నిర్మల్ ఇన్‌చార్జి మేనేజర్లు గజ్జారాం, సాయన్న, డెయిరీ డిస్ట్రిబ్యూటర్ రమణారెడ్డి, సూపర్‌వైజర్ రమేశ్, పాలమిత్ర ముత్యం తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

కుంటాల: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని ఏఈవో గణేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో ఆయిల్‌పాం సాగు విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరమేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

పెంబి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు నమోదుపై అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు రాందాస్, రవి ఓటరు నమోదు, జాబితాలో సవరణ, తొలగింపు ప్రక్రియ వంటి అంశాలు వివరించారు. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, ఆర్‌ఐ హుస్సేన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు శుక్రవారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ కపిల్‌కుమార్ పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కుంటాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనర్లు గజానన్ కులకర్ణి, తాటి గంగాదాస్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు తమ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వో కలీం, డీటీ నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలను కలిసిన నాయకులు

భైంసాటౌన్: భైంసా మండలంలోని బీఆర్‌ఎస్ పలువురు నాయకులు టీఎస్ ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారితోపాటు ఎమ్మెల్సీ దండె విఠల్, మల్కాజిగిరి ఎమ్మెల్యే హనుమంత్‌రావు, ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌రావును శుక్రవారం వేర్వేరుగా కలిశారు. సోలంకి భీంరావు, పండిత్‌రావు, రమేశ్, మధుకర్ వారికి బాసర సరస్వతి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు విషయమై చర్చించినట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు మి న హా ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ గెలుస్తుందని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

సమ్మెకు బీఎస్పీ మద్దతు

ముధోల్: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగ్మే దేవిదాస్ మద్దతు పలికారు. ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించి కనీస వేతనాలు అందించాలని ఆయన కోరారు.